చెట్టు నరికివేసిన వ్యక్తికి రూ.5 వేల జరిమానా

తూప్రాన్, ఏప్రిల్ 6: బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'హరితహారం' నేడు చక్కటి ఫలితాలు ఇస్తున్నది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేక నిర్లక్ష్యంతో తూప్రాన్ ప్రధాన రహదారిపై నాటిన మొక్కలు నరికివేతకు గురవుతున్నాయి. తూప్రాన్ ప్రధాన రహదారిపై (పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం) పక్కన కేతారాం చెట్టును నరికేశాడు. చెట్టు నరికినందుకు కేతారామ్‌కు రూ.5 వేల జరిమానా విధించారు. చెట్లు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ మేనేజర్ రఘువరన్ హెచ్చరించారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ

పెద్దశంకరంపేటలో ధ్వజస్తంభానికి పూజ చేస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 6: పట్టణంలోని దుర్గామాత విగ్రహ పునఃప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో దుర్గామాత, సంతాన నాగేంద్రులు, కేశమ్మ, పాపమ్మ దేవాలయాలకు ధ్వజ స్తంభం, సింహం, అమ్మవారి పాదుకలు, ప్రతిష్ట కార్యక్రమాలు వేదబ్రాహ్మణ మంత్రోశ్చరణలతో వైభవంగా నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన బీజేపీ

వెల్దుర్తిలో బీజేపీ జెండాను తొలిగిస్తున్న ఎన్నికల అధికారులుట

వెల్దుర్తి, ఏప్రిల్ 6: ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నాటి నుంచి నిబంధనలు అమల్లోకి వచ్చాయి. కాని వాటిని విస్మరిస్తున్న నాయకులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పుర స్కరించుకొని వెల్దుర్తిలో శనివారం బీజేపీ జెండాను మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు ఆధ్వర్యంలో ఎగురవేశారు. సమాచారం అందుకున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, ఎన్నికల ప్రవర్తన నియమావళి బృందాలు గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి జెండాను తొలిగించారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

ప్రశాంత్ మృతదేహం

మనోహరాబాద్, ఏప్రిల్ 6: ప్రేమ విఫలమైనందుకు యువకుడు మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన బ్యాగరి ప్రశాంత్ (24) ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతను ప్రేమించిన అమ్మాయికి ఐదు నెలల క్రితం వివాహమైంది. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం రాత్రి చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత

బాధిత కుటుంబానికి పరిహారం చెక్కును అందజేస్తున్న డీఎఫ్‌వో రవిప్రసాద్

చిలిపిచేడ్, ఏప్రిల్ 6: అడవిపంది దాడిలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి అటవీ శాఖ తరపున నష్టపరిహారాన్ని అటవీ అధికారులు బాధిత కుటుంబాన్ని శనివారం అందజేశారు. మండలంలోని అజ్జమర్రి గ్రామానికి చెందిన పన్యాల శంకరయ్యపై కొన్ని రోజుల క్రితం అడవి పంది దాడి చేసింది. దీంతో తీవ్ర గాయాలై మృతిచెందాడు. అటవీ శాఖ తరపున బాధిత కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెక్కును జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో డీఎఫ్ఓ రవిప్రసాద్ తదితరులు అందజేశారు.

ఘనంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం

మల్లికార్జున స్వామి కల్యాణానికి హాజరైన రాజిరెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 6: మండలంలోని బస్వాపూర్‌లో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబ, మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితుల కనుల పండువగా జరిపించారు. ఉత్సవాలకు పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి హాజరై, స్వయంభూ శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 6: పిల్లలకు పోషకాలున్న ఆహారం పెట్టడంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు శివకుమారి తెలిపారు. శనివారం చిన్నశంకరంపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మట్లాడుతూ పోషకాహారం తీసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నాగలక్ష్మి, నాగరాణి, నాగమణి పాల్గొన్నారు.

'పేట'కు చేరుకున్న రాజ్యాంగ రక్షణ యాత్ర

రామాయంపేట, ఏప్రిల్ 6: రాజ్యాంగ రక్షణ యాత్రకు ప్రజలు భారీగా హాజరు కావాలని రాష్ట్ర రాజ్యాంగ రక్షణ యాత్ర రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. శనివారం రామాయంపేటకు చేరుకున్న రాజ్యాంగ రక్షణ యాత్రలో ఆయన మాట్లాడారు. ఈ యాత్ర హైదరాబాద్‌లో ఈనెల 8న నిర్వహించనున్నారన్నారు. కార్యక్రమంలో జైభీమ్ సైనిక్ దళ్ కన్వీనర్ పురుషోత్తం, మాల మహానాడు రాష్ట్ర సైనిక్ బ్యూరో చైర్మన్ ర్యాకల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి వెన్నె రాజు, మసాయిపేట మల్లే శం, దుబాషి సంజీవు, బైరం సిద్ధరాములు, బండారి చంద్రయ్య, బ్యాగరి రాజు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

తుక్కుగూడ సభకు కాంగ్రెస్ నాయకులు

తూప్రాన్, ఏప్రిల్ 6: కాంగ్రెస్ ఆధ్వర్యంలో తుక్కుగూడలో నిర్వహించిన బహిరంగ సభకు తూప్రాన్ మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వెళ్లిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, రవీందర్ గుప్తా, నారాయణ గుప్తా, శ్రీశైలంగౌడ్, రఘుపతి, నర్సింగరావు, నాగరాజు, సత్యనారాయణ గౌడ్, అనిల్, ఉమర్, దామోదర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మాణిక్‌రావు ఉన్నారు.

- నీళ్ల కోసం రైతులు రోడ్డెక్కినా పట్టించుకోని సీఎం
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- ఎండుతున్న పంటలను రక్షించాలని వెల్లువెత్తిన నిరసనలు

నీళ్లు వదలాలని కోరినా... సీఎం స్పందించడం లేదు

నర్సాపూర్, ఏప్రిల్ 6: నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయని, రిజర్వాయర్ల నుంచి నీటిని వదలాలని ముఖ్యమంత్రిపై మంత్రులు ఒత్తిడి తెస్తున్నారని, అయినా సీఎంలో చలనం లేదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆరోపించారు. శనివారం నర్సాపూర్‌లో బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులను రాజు చేయాలనే ఆలోచనతో కేసీఆర్ వారి సంక్షేమానికి కృషి చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యిందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చక ముందే పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడానికి హామీలతో కూడిన మ్యానిఫెస్టోను విడుదల చేస్తూ మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తుందన్నారు.

చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే రూ.2 లక్షలు రుణమాఫీపై మొదటి సంతకం చేస్తానని చెప్పి, నేడు మాట తప్పారన్నారు. రైతుభరోసా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి, రైతులను నట్టేట ముంచారన్నారు. 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వకపోవడంతో మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నిత్యం కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కరెంట్ కోతలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుభరోసా డబ్బులు అందకపోవడంతో రైతులు వడ్డీకి అప్పులు తెచ్చుకుని పంట పండిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆ పంట కూడా నీరు లేక ఎండుతున్నదన్నారు. అధిష్టానం పిలుపు మేరకు ఎండిన పంటలను చూడడానికి వెళ్లినప్పుడు ఎండిన పంటను రూ.1500లకు అమ్ముకుని పశువులను మేపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

20 లక్షల ఎకరాల్లో ఎండిన పంటలు

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. కేసీఆర్ ఎండిన పంటలను పరిశీలించడానికి వస్తే తప్ప ప్రాజెక్ట్‌ల నుంచి నీరు వదలలేదన్నారు. నేడు మంత్రులే నీటిని వదలాలని సీఎం రేవంత్‌రెడ్డితో కొట్లాడుతున్నారన్నారు. ఓ మంత్రి నేరుగా దగ్గరుండి నీళ్ల విడిపిస్తానని సీఎంతో అన్నారన్నారు. పంట లన్నిటికీ బోనస్ ఇస్తానని హామీ ఇచ్చి, నేడు వరికి మాత్రమే ఇస్తామని అది కూడా మద్దతు ధర లేకపోతేనే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో వడగండ్లకు పంట నష్టం జరిగితే మాజీ సీఎం కేసీఆర్ ఎకరానికి రూ.10 వేలు ప్రకటించాడన్నారు. ఈ నష్ట పరిహారం సరిపోదని ఎకరానికి రూ.20 వేలు ఇవ్వాలని సీఎం అప్పట్లో అన్నాడని, నేడు ఎందుకు నష్టపరిహారం అందించడం లేదని దుయ్యబట్టారు.



నర్సాపూర్‌లో నిర్వహించిన రైతు నిరసన దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి

ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. రుణమాఫీ కింద రైతుల ఖాతాలను బ్యాంకులు హోల్డ్‌లో పెట్టాయని, తక్షణమే ప్రభుత్వం రుణ మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ రైతులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దన్నారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, లేబర్ వెల్ఫేర్ బోర్డ్ మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, యువనాయకులు శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ నయూమొద్దీన్, కౌన్సిలర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- జిల్లాలో 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, ఏప్రిల్ 6: దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ రాహుల్‌రాజ్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని మహమ్మద్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 410 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మ, నర్సాపూర్ క్లస్టర్ అసిస్టెంట్ రిజిస్టర్ శంకర్ నాయక్, పీఏసీఎస్ ఈవో దుర్గాగౌడ్, మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి ఏవో దివ్య తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట, ఏప్రిల్ 6: చేగుంట మండలంలోని వడియారం, అనంతసాగర్, రుక్మాపూర్, ఇబ్రహీంపూర్, బోనాల్, చిన్నశివునూర్, కర్నాల్‌పల్లి తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గియానిస్సా బేగం, ఎంపీడీవో చిన్నరెడ్డి, ఐకేపీ డీపీఎం మోహన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ డీపీఎం మోహన్, ఏపీఎం లక్ష్మీ నర్సమ్మ, రామస్వామి, శ్వేత, స్వామి, అంజ్యానాయక్, పంచాయతీ కార్యదర్శి విజయ్, వీవో లీడర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 6: మండలంలోని కమలాపురం, బుజ్రాన్‌పల్లి, గొట్టిముక్కుల, కొత్తపేట, జూకల్, భూర్గుపల్లి, శివయపల్లి, ఆయా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ఏపీఎం గోపాల్ తెలిపారు.

కౌడిపల్లి: మహమ్మద్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చేగుంట: ఇబ్రహీంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్,ఎంపీడీవో తదితరులు

తూప్రాన్‌లో..

తూప్రాన్, ఏప్రిల్ 6: ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని ఇస్లాంపూర్, దాతర్‌పల్లి, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్ (కోనాయపల్లి), వెంకటాయపల్లి, కిష్టాపూర్, యావాపూర్, నర్సంపల్లి, ఘనపూర్, వట్టూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సీఏలు తదితరులు ప్రారంభించారు.

చిన్నశంకరంపేటలో

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 6: మండలంలోని వెంకట్‌రావ్‌పల్లి, కుర్మపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం లక్ష్మీనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీ యశోద, మాజీ సర్పంచ్ నర్సయ్య, వెంకట్, పద్మ, శేఖర్, నరేశ్, భిక్షపతి, మల్లేశం పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం, ఏప్రిల్ 6: మండలంలోని కాయిదంపల్లి, సీతానగర్, రాంపూర్, పెద్దాపూర్ గ్రామాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో శంకర్ ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శులు, సీసీలు బాబు రావు, బేతయ్య, అబెద్, సత్యనారాయణ, మండల సమాఖ్య అకౌంటెంట్ పద్మ పాల్గొన్నారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, ఏప్రిల్ 6: వెల్దుర్తి, మాసాయిపేట మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఐకేపీ ఏపీఎం శంకరయ్య తెలిపారు. మండలంలోని అక్కమ్మపల్లి, శేరీల, మహ్మద్‌నగర్ తండా, మాసాయిపేట మండలంలోని బొమ్మారం, హక్కీంపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ సిబ్బంది, మహిళా సభ్యులతో కలిసి ప్రారంభించారు.

మనోహరాబాద్‌లో

మనోహరాబాద్, ఏప్రిల్ 6: మండలంలోని పర్కిబండ, లింగారెడ్డిపేట, రంగాయిపల్లి, కూచారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల సమైక్య కార్యదర్శి పద్మ, ఏపీఎం పెంటాగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవో సచిన్, సీసీ విజయలక్ష్మి, శోభారాణి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

మనోహరాబాద్ మండలంలోని పర్కిబండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపి సిబ్బంది

పెద్దశంకరంపేట: కమలాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం గోపాల్

అల్లాదుర్గం: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శంకర్

వెల్దుర్తి: హక్కీంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపి సిబ్బంది, సంఘాల సభ్యులు

పని కల్పించడమే ఉపాధి హామీ లక్ష్యం

మెదక్‌రూరల్, ఏప్రిల్ 6: గ్రామీణ ప్రాంతాల్లో పని కల్పించడమే ఉపాధి హామీ పథకం ప్రధాన ఉద్దేశమని ఎంపీడీవో రఘు అన్నారు. శనివారం మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఉపాధి కూలీలు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు పని చేయాలన్నారు. కొలతల ప్రకారం పని చేసే ఒక్కొక్కరికి రూ.300 వేతనం లభిస్తుందన్నారు. 18 ఏండ్ల లోపు పిల్లలు పని చేయవద్దన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

బీటీ రణదీవెకు ఘన నివాళి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 6: కార్మిక ఉద్యమ నేత, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు కామ్రేడ్ బీటీ రణదీవె వర్ధంతిని శనివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేందర్, బస్వరాజు, నాయకులు నాగరాజు, మల్లేశం, సంతోష్, లచ్చాగౌడ్, నర్సమ్మ, రాణి, సత్యం పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి: డీఎస్పీ

రేగోడ్, ఏప్రిల్ 6: ఎన్నికల నిబంధనలు పాటించాలని డీఎస్పీ రాజేశ్ తెలిపారు. శనివారం రేగోడ్ పోలీస్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించొద్దన్నారు. గంజాయి, మత్తు పదార్థాలపై నిఘా, బెట్టింగులు, పేకాట లాంటిపై సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. నంబర్ ప్లేట్, పేపర్లు లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఆయనతో ఎస్సై రాజయ్య, ఏఎస్సై మల్లయ్య, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చేగుంట,ఏప్రిల్06: చేగుంట మండలం చందాయిపేట గ్రామానికి చెందిన తలారి సిద్దమ్మ ఇటీవల మృతి చెందింది. శనివారం బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం, నగదును అందజేసిన మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్

శీతలాదేవి ఆలయానికి విరాళం

నిజాంపేట, ఏప్రిల్ 6: చల్మెడలో నిర్మిస్తున్న మడేలేశ్వర శీతలాదేవి ఆలయానికి గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి రూ.30 వేల విరాళాన్ని శనివారం రజక సంఘం సభ్యులకు అందజేశారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్, ఏప్రిల్ 6: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. తూప్రాన్‌లోని జామియా మసీద్‌లో శనివారం బీఆర్ఎస్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు బురాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. కార్యక్రమంలో మైనార్టీ మున్సిపల్ నాయకులు బురాన్, సత్తార్, అహ్మద్, బీఆర్ఎస్ తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షుడు సతీశ్‌చారీ, ప్రభాకర్‌రెడ్డి, చక్రవర్తి, శ్రీనివాస్, చంద్రారెడ్డి, చంద్రశేఖర్, నరేశ్, వెంకటాచారి, రమేశ్ చారి, మహేశ్, నరేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పథకాలతోనే దేశాభివృద్ధి : బీజేపీ

రామాయంపేట, ఏప్రిల్ 6: ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలతోనే దేశం అభివృద్ధి బాటలో పయనిస్తున్నదని బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓటును అభ్యర్థిస్తున్నారు. శనివారం రామాయంపేట లోని పలు వీధుల్లో ఆ పార్టీ నాయకులు మోదీ ప్రవేశపెట్టిన పథకాలు, తెలంగాణలో ఎంతో మందికి ఉపాధినిచ్చాయని, ఈసారి కచ్చితంగా ప్రధాని మోదీకే ఓటేయాలని ఓటర్లను కోరుతున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలను సమాన స్థాయిలో చూసిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. ప్రచారంలో పార్టీ పట్టణాధ్యక్షుడు భానుచందర్, శంకర్‌గౌడ్, దామోదర్‌రావు, చింతల శేఖర్, వెల్ముల రమేశ్, వినయ్ ఉన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 6: బీజేపీ ఆవిర్భావ వేడుకలను పెద్దశంకరంపేటలో ఘనంగా నిర్వహించినట్లు మండలాధ్యక్షుడు కోనం వితల్ తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి బీజేపీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు సుభాశ్, సూర్యప్రకాశ్, సంగమేశ్వర్ తదితరులున్నారు.

రేగోడులో..

రేగోడ్, ఏప్రిల్ 6: భారతీయ జనతా పార్టీ 44 ఆవిర్భావ వేడుకల్లో భాగంగా రేగోడ్ మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ చేశారు. మండల బీజెపి అధ్యక్షులు సంగమేశ్వర్,లక్ష్మణ్,దోండిరావు, ప్రశాంత్, వీరన్న, నరేశ్, సతీశ్, శివకుమార్, నవీన్ ఉన్నారు.

అడవిలో సాసర్ ఫీట్లు ఏర్పాటు

- వన్యప్రాణుల దాహార్తి తీరుస్తున్న సిబ్బంది

అక్కన్నపేట అటవీ ప్రాంతంలో అడవి జంతువుల దప్పిక కోసం సాసర్ ఫీట్లలో నీళ్లు పడుతున్న బీట్ ఆఫీసర్

రామాయంపేట, ఏప్రిల్ 6: అడవి జంతువుల దప్పిక తీర్చడం కోసం అటవీ ప్రాంతంలో సాసర్ ఫీట్లు ఏర్పాటు చేసి, అందులో నీళ్ల పోసి రక్షిస్తున్నట్లు అక్కన్నపేట బీట్ ఆఫీసర్ రాము తెలిపారు. శనివారం తన బీట్ పరిధిలోని అక్కన్నపేట, తొనిగండ్ల, పర్వతాపూర్, లక్ష్మాపూర్ తదితర అటవీ ప్రాంతంలో సాసర్ ఫీట్లు ఏర్పాటుచేశామన్నారు. ఎండ తీవ్రత రోజురోజుకు ఎక్కువ అవుతున్నందున జంతువులకు హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సాసర్‌ఫీట్లలో ట్యాంకర్‌తో నీళ్లు నింపుతున్నట్లు తెలిపారు.

42 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

పట్టుకున్న కంటైనర్, నిందితుడు బీరతో పోలీసులు

తూప్రాన్, ఏప్రిల్ 6: తూప్రాన్‌లో 42.28 టన్నుల రేషన్ బియ్యాన్ని హైదరాబాద్ కాటేదాన్ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారి ప్రభాకర్ తూప్రాన్ పోలీసులకు సమాచారమిచ్చారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం సిబ్బందితో కలిసి తూప్రాన్ టోల్‌గేట్ వద్ద రేషన్ బియ్యం తరలిస్తున్న కంటైనర్‌ను, హర్యానాకు చెందిన నిందితుడు బీర తండ్రి కాళీరామ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. తూప్రాన్ తహసీల్దార్ విజయలక్ష్మి సమక్షంలో పౌర సరఫరాల శాఖ ప్రత్యేకాధికారి సాధిక్‌కు సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★Gajwel Town Main Road, Near SBI, Residential Plot 161 Sq.yds., Clear Title, Immdt. Sale. Ph: 8143366630 / 9989554915. NT-111

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర, 161 చ.గ.। ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630 / 9989554915. NT-110

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899. NT-311821-All

★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253. NT-311882-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న ఒప్పందములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.